తెలుగు దినపత్రిక
ప్రభాత jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
08-06-2024
శనివారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 288 | పేజీలు : 8 | వెల : 4


జయభేరి దినపత్రిక
జయభేరి చానల్లో
నికార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా..
ఆసక్తి కలిగిన యువతీ
యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత
jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889
JB జయభేరి



## స్పేస్ స్టేషన్‌లో డ్యాన్స్ చేసిన సునితా విలియమ్స్

**జయభేరి, న్యూఢిల్లీ జూన్ 7:**

సునితా విలియమ్స్ డ్యాన్స్ చేశారు. స్పేస్ స్టేషన్‌లో తన సంతోషాన్ని ఆమె వ్యక్తం చేశారు. బోయింగ్ స్టార్‌లైనర్‌లో అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన భారతీయ మూలాలు ఉన్న ఆస్ట్రోనాట్ సునితా.. తోటి వ్యోమగాముల్ని కలుసుకున్న తర్వాత తనదైన స్టయిల్‌లో ఎంజాయ్ చేశారు. గతంలో గణేశుడి ప్రతిమ, భగవద్గీతతో అంత రిక్షంలోకి వెళ్లిన 59 ఏళ్ల సునితా విలియమ్స్ .. మూడవసారి స్పేస్ స్టేషన్‌కు వెళ్లారు. స్పేస్ స్టే షన్‌కు వెళ్లిన ఆనందంలో ఆమె డ్యాన్స్ చేసింది. అక్కడ ఉన్న ఏడు మంది ఆస్ట్రోనాట్‌స్‌ను హగ్ చేసుకున్నది. బోయింగ్ స్టార్‌లైనర్‌లో విలియమ్‌స్‌తో పాటు విల్మోర్ వెళ్లారు. డ్యాన్స్ పార్టీ గురించి మాట్లాడుతూ.. ఇలాగే ఎంజాయ్ చేయాలన్న ఉద్దేశాన్ని సునితా వ్యక్తం చేశారు.



## బెదిరింపులతో భయమేస్తోంది
యాంకర్ శ్యామల

**జయభేరి, విజయవాడ:**

ఏపీ ఎన్నికల సమయంలో యాంకర్ శ్యామల హాట్ టాపిక్‌గా మారింది. వైఎస్ జగన్ కోసం.. వైసీపీ గెలుపు కోసం ఆమె చాలానే ప్రచారం చేశారు. ఈ క్రమంలో టీడీపీ అధినేత చం ద్రబాబు, జనసేన పవన్ కల్యాణ్‌పై శ్యామల చేసిన విమర్శలు తెగ వైరల్ అయ్యాయి. దీంతో ఆమెపై అటు టీడీపీ.. ఇటు జనసేన అభిమాను లు మండిపడ్డారు. అధికారంలోకి వచ్చాక మీ సంగతి చెబుతామన్నట్లుగా వార్నింగ్‌లు కూడా ఇచ్చారు. అయితే అన్నట్టుగా ఏపీలో ఎన్డీయే కూటమి అఖండ విజయం సాధించింది. దీంతో పలువురు టీడీపీ, జనసేన అభిమానులు యాంకర్ శ్యామలను టార్గెట్ చేసి వార్నింగ్‌లు ఇస్తున్నారు. ఈ క్రమంలో శ్యామల ఓ వీడియో ద్వారా స్పందించారు. ఒకవైపు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు శుభాకాంక్షలు చెబుతూనే.. బెదిరింపు కాల్‌స్‌తో భయమేస్తోందంటూ ఆవేదన వ్యక్తం చేసింది.



## కవిత జ్యుడీషియల్ రిమాండ్ 21 వరకు

**జయభేరి, న్యూ ఢిల్లీ, జూన్ 7:**

మద్యం పాలసీ కేసులో బిఆర్‌ఎస్ ఎంఎల్ సి కవిత జ్యుడీషియల్ రిమాండ్‌ను రౌస్ అవెన్యూ సిబిఐ ప్రత్యేక కోర్టు పొడిగించింది. సిబిఐ కేసులో రిమాండ్‌ను ఈ నెల 21వ తేదీ వరకు పొడిగించింది. జైల్లో చదువుకోవడానికి తనకు పుస్తకాలు కావాలని కవిత కోర్టును కోరింది. ఆమె విజ్ఞప్తికి కోర్టు ఆమోదం తెలిపింది. కవితకు జైల్లో ఎనిమిది పుస్తకాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. అంతకుముందు, మద్యం పాలసీ కేసులో కవిత పాత్రపై సిబిఐ సప్లిమెంటరీ ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది.



# పేదరిక నిర్మూలనే మా అజెండా

**జయభేరి, న్యూఢిల్లీ, జూన్ 7**

ఎన్డీయే అనేది భారతదేశపు ఆత్మ అని కొనియా డారు. ఎన్నికలకు ముందే కూటమి గట్టి విజయం సాధించడం ఒక గొప్ప చరిత్ర అన్నారు. ఇవి నాకు భావోద్వేగ క్షణాలని వివరించారు. ఏపీలో ప్రజలు ఎన్డీయే కూటమికి చారిత్రాత్మక విజయం అందించారన్నారు. తెలుగురాష్ట్రాల్లో ప్రజలు ఎన్డీ యేని బలపరిచారని చెప్పారు. గెలుపును ఎంత ఆస్వాధిస్తామో, పరాజితులను కూడా అంతే గౌరవిస్తామన్నారు. ఈ సందర్భంగా ఇండియా కూటమి నేతలను విమర్శించారుపార్లమెంట్ సెంట్రల్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో మోదీ ప్రసంగించారు. ముందుగా ఎన్డీయే మిత్ర పక్షాల కార్యకర్తలకు శిరసువంచి నమస్కరిస్తు న్నానన్నారు మోదీ. ఎన్డీయే గెలుపుకు శ్రమించిన కార్యకర్తలందరికీ అభినందనలు తెలిపారు. ఇవాళ పార్లమెంట్ సెంట్రల్‌హాల్‌లో జరిగిన సమావేశంలో ఎన్డీయేపక్ష నేతగా నరేంద్రమోదీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మోదీ పేరును రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదిస్తే అమిత్‌షా, నితిన్ గడ్కరీ బలపరిచారు. ఎన్డీయేపక్ష నేతగా 3వ సారి ఎన్నికైన నరేంద్రమోదీ.. ప్రధానిగా సేవలు అందించబోతున్నారు. ఎన్డీయే పక్ష సమావేశానికి హాజరైన మోదీ.. రాజ్యాంగానికి ప్రణామం చేసి ఉద్వేగంగా కనిపించారు. ఆ తరువాత పార్లమెం టరీ పక్షనేతగా ప్రసంగించిన మోదీ కార్యకర్తలను ఆకాశానికి ఎత్తేశారు. 22రాష్ట్రాల్లో ఎన్డీయే మి త్రపక్షాలు కలిసి ఉన్నాయన్నారు. విశ్వాసం అనే బంధం తమను కలిపిందని అన్నారు. ఎండనకా,

...మిగతాది 2 లో




## ప్రజావాణి ప్రారంభం

**జయభేరి, హైదరాబాద్, జూన్ 7 :**

ఎన్నికల కోడ్‌తో తాత్కాలికంగా వాయిదా పడ్డ ప్రజావాణి పునఃప్రారంభంమైంది మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో అర్జీలు స్వీకరించారు.తెలంగాణ రాష్ట్రంలో జూన్ 7 శుక్రవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం పునఃప్రారంభమైంది. లోక్ సభ ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ వల్ల ఈ కార్యక్రమం తాత్కాలిక వాయిదా పడింది. ఎన్నికల కోడ్ ముగియడంతో తిరిగి ప్రారంభిం చనున్నారు అధికారులు. ఈ విషయాన్ని

...మిగతాది 2 లో




## పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీకి బెయిల్

**జయభేరి, బెంగళూరు జూన్ 7:**

కర్నాటక బిజెపి ఎంఎల్ సి కేశవ్ ప్రసాద్ దాఖలు చేసిన పరువు నష్టం కేసులో శుక్రవారం కోర్టు కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి బెయిల్ మంజూరు చేసింది. రాహుల్ గాంధీ 42వ అదనపు చీఫ్ మెట్రోపాలిట్ మెజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరయ్యారు.రాహుల్ గాంధీకి మాజీ ఎంపీ, ఉపముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ సోదరుడు డి.కె. సురేశ్ రూ. 75 లక్షలు విలువ చేసే తన ఆస్తిని షూరిటీ గా ఇచ్చారు. కాగా కోర్టు కేసు విచారణను

...మిగతాది 2 లో

## చేప ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు



**జయభేరి, హైదరాబాద్, జూన్ 7:**

మృగశిర కార్తె రానుండటంతో హైదరాబాద్‌లో చేప మందు ప్రసాదం అందించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆస్తమా సహా శ్వాసకోస సంబంధిత ఇబ్బందులు ఉన్నవారికి బత్తినసో దరుల ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా ఈ చేపమందు ను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. అందులో భాగంగానే ఈఏడాది సైతం చేపప్రసాదం అందిం చనున్నారు. మృగశిరకార్తె ప్రారంభం కానుండ టంతో ఈనెల 8 నుంచి నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో చేపమందు ప్రసాదం పంపిణీ చేయ నున్నారు. బత్తిన కుటుంబం ఆధ్వర్యంలో ఈ కార్య క్రమాన్ని ఏటా పెద్దఎత్తున నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా చేపమందు అందించనుండటంతో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆస్తమా ఉన్న రోగులకు ఈ చేపమందు దివ్య ఔషధంలా పనిచేస్తుందన్న ప్రచారం నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల నుంచేగాక...మహారాష్ట్ర, కర్ణాటక నుంచీ పెద్దఎత్తున ప్రజలు తరలివస్తుంటారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో కౌంటర్లు ఏర్పాటు చేసి వరుస క్రమంలో ఈ మందు అందజేస్తారు. మృగ శిరకార్తె రోజు అందించే ఈ చేపమందు ప్రసాదం కోసం ముందురోజు రాత్రికే వచ్చి క్యూలైన్‌లోనే వేచి ఉంటారు. అందుకు అనుగుణంగా అధికారు లు లైట్లు,బారీకేడ్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తు న్నారు. బత్తిన కుటుంబం కొన్ని దశాబ్దాలుగా ఈ చేపమందును ఉచితంగా అందజేస్తోంది. బత్తిన శంకర్‌గౌడ్ వాళ్ల

...మిగతాది 2 లో

## 2047 నాటికి ఇండియా నెంబర్ వన్



**జయభేరి, న్యూఢిల్లీ, జూన్ 7:**

మోదీ నేతృత్వంలో భారత్ 2047 నాటికి ప్రపంచంలోనే నెంబర్ 1గా నిలుస్తుందని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ఎన్డీయే లోక్ సభా పక్ష నేతగా మోదీ పేరును ప్రతిపాదించగా ఆయన టీడీపీ తరపున సమర్థించారు. ఎన్డీయే ఎంపీలు ఢిల్లీలోని పాత పార్లమెంట్ భవనం లోని సెంట్రల్ హాల్‌లో శుక్రవారం ఉదయం సమావేశమయ్యారు. ఈ భేటీలో చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ హాజరయ్యారు.

...మిగతాది 2 లో

## ఆరు నెలల్లో ఎంత మార్పో

BHARAT RASHTRA SAMITHI
BRS
భారత రాష్ట్ర సమితి

**జయభేరి, హైదరాబాద్, జూన్ 7 :**

ఆరు నెలలు.. కేవలం ఆరంటే ఆరే నెలల్లో హీరో నుంచి జీరోకి పడిపోయింది బీఆర్ఎస్. అధికారం నుంచి కోలుకోలేని స్థితికి.. ఆఖరికి 20 ఏళ్లలో ఏనాడు లేని అత్యంత అవమాన కర పరిస్థితిలోకి.. ఇది భారత రాష్ట్ర సమితి పరిస్థితి. లోకసభ ఫలితాల్లో బీఆర్ఎస్ గెలిచిన లోక్‌సభ సీట్ల సంఖ్య సున్నా. భారత రాష్ట్ర సమితి. ఉద్యమాల నుంచి పుట్టిన పార్టీ. టు బీ ఫ్యాక్ట్.. ఉద్యమం కోసమే పుట్టిన పార్టీ. అంతేకాదు ఆరు నెలల క్రితం వరకు అధికార పార్టీ. 88 అసెంబ్లీ సీట్లు, 9 ఎంపీ సీట్లతో రాష్ట్రంలో అతిపెద్ద

...మిగతాది 2 లో

## రామోజీ రావుకు తీవ్ర అస్వస్థత: వెంటిలెటర్‌పై చికిత్స



**జయభేరి, హైదరాబాద్:**

ఈనాడు సంస్థల అధినేత, రామోజీ గ్రూప్ ఛైర్మన్ చెరుకూరి రామోజీ రావుకు అనారోగ్యా నికి గురయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం రామోజీ రావు తీవ్ర అస్వస్థతకు గురవడంతో.. వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించారు. హైదరాబాద్ శివారులో ఉన్న రామోజీ ఫిల్మ్ సిటీలోని రామోజీ రావు నివాసం నుంచి.. నానక్‌రామ్‌గూడలోని స్టార్ హాస్పిటల్‌కు తర లించారు. స్టార్ హాస్పిటల్ డాక్టర్లు రామోజీ రావుకు

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## పేదరిక నిర్మూలనే మా అజెండా

వాననకా కష్టపడి పనిచేసి విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్క కార్యకర్తల గురించి ఎంతచెప్పినా తక్కువే అవుతుందన్నారు. అయితే ప్రభుత్వం నడపడానికి అందరి సహకారం అవసరం అన్నారు. అందుకే మిత్రపక్షాల మద్దతు తీసుకున్నానన్నారు.గోవా, ఈశాన్య రాష్ట్రాల్లో క్రైస్తవులు ఎక్కువగా ఉన్నారన్నారు. తనపై నమ్మకంతో దేశ బాధ్యతలు అప్పగించారన్నారు. భారత స్ఫూర్తికి మన ఎన్డీయే కూటమి ఉదాహరణ అన్నారు.తమిళనాడులో ఎన్డీయే కూటమికి సీట్లు రాకపోవచ్చు.. అక్కడ ఏం జరుగుతుందో మున్ముందు ఉంటుందని చెప్పారు. ఇక విజయం సాధించి ఇక్కడికి వచ్చిన ప్రతిఒక్కరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. ఆదివాసీలు అధికంగా ఉన్న 10 రాష్ట్రాల్లో ఎన్డీయేకు అత్యధిక స్థానాలు ఇచ్చారన్నారు. అలాగే ఆదివాసీలు ఎక్కువగా ఉన్న 7 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నామని గుర్తు చేశారు. క్వాలిటీ ఆఫ్ లైఫ్, గుడ్ గవర్నెన్స్ అందిస్తామని మాట ఇచ్చారు. ఇదే ఎన్డీయే స్ఫూర్తి అని పేర్కొన్నారు. 30 ఏళ్లుగా దేశంలో ఎన్డీచే కూటమి నడుస్తోందని చెప్పారు. పేదరిక నిర్మూలనతోనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. గత పదేళ్లలో పేదరికాన్ని నిర్మూలించామన్నారు. రానున్న రోజుల్లో కూడా మరింత అభివృద్ధికి, విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడతామన్నారు. ఈ కార్యక్రమానికి బీజేపీ అగ్రనేతలు, కూటమి నేతలు మోదీకి సాదర స్వాగతం పలికారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, నితీష్ సహా 9 మంది ఎన్డీయే మిత్రపక్షాల నేతలు వేదికపై ఉన్నారు. దీంతో ఇవాళ పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో సందడి వాతావరణం కనిపించింది. కూటమి నేతలతోపాటు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎంలు, ముఖ్యనేతలు కూడా హాజరయ్యారు.చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లపై మోదీ ప్రశంసల జల్లు కురిపించారు. పవన్ అంటే పవన్ కాదు ఒక తుఫాన్ అన్నారు. ఏపీలో చంద్రబాబు చారిత్రాత్మక విజయం సాధించారన్నారు. పవన్ వల్లే ఏపీలో భారీ విజయం లభించిందని కీర్తించారు.

## 2047 నాటికి ఇండియా నెంబర్ వన్

ఈ సమావేశానికి 240 మంది బీజేపీ ఎంపీలతో పాటు టీడీపీ, జేడీయూ, శివసేన, లోక్‌జనశక్తి (రాంవిలాస్), ఎన్‌సీపీ, జేడీఎస్, జనసేన, అప్నాదళ్ సహా ఇతర మిత్రపక్షాల ఎంపీలు, ఎన్డీయే పార్టీల మంత్రులు ఇతర ముఖ్య నేతలు హాజరయ్యారు. ఎన్డీయేను అధికారంలోకి తేవడానికి మోదీ రేయింబవళ్లు కష్టపడ్డారని.. భారతదేశానికి సరైన సమయంలో సరైన నాయకత్వం దొరికిందని టీడీపీ అదినేత చంద్రబాబు ప్రశంసించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఎన్నికల ప్రచారం చివరి వరకూ మోదీ నిరంతం శ్రమించారని చెప్పారు. 'ఏపీలోనూ 3 బహిరంగ సభలు, ర్యాలీల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలో 90 శాతం స్థానాలు గెలిచాం. విజనరీ నాయకుడి నేతృత్వంలో భారత్ అభివృద్ధిలో దూసుకుపోతుంది. పదేళ్లలో ఆర్థిక వ్యవస్థను పరుగులు తీయించారు. భారత్ ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. సరైన సమయంలో సరైన వ్యక్తి ప్రధాని కావడంతో దేశం పురోభివృద్ధి సాధించింది. మేకిన్ ఇండియాతో భారత్‌ను ఆయన అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లారు. ప్రపంచవ్యాప్తంగా భారత్ ప్రతిష్టను ఇనుమడింప చేశారు. మోదీ నాయకత్వంలో దేశం పేదరిక రహితంగా మారుతుంది.' అని చంద్రబాబు కొనియాడారు.

## ఆరు నెలల్లో ఎంత మార్పో

పార్టీగా ఏకఛత్రాధిపత్యం చేసింది. కట్ చేస్తే.. ఇప్పుడు 39 అసెంబ్లీ స్థానాలతో ప్రతిపక్షానికి పరిమితమైంది. ఇక ఈ లోక్ సభ ఎన్నికల్లో పార్టీ అడ్రస్సే మొత్తానికి గల్లంతైంది. ఇది ఆరు నెలల్లో బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి. 2001లో టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం తర్వాత.. అంటే 20 ఏళ్ల తర్వాత ఇప్పుడా పార్టీ ఫర్ ది ఫస్ట్ టైమ్.. ఆ పార్టీ లోక్‌సభ సీట్ల సంఖ్య జీరోకి పరిమితమైంది. 17 ఎంపీ స్థానాల్లో ఒక్క దాంట్లో కూడా కనీసం పోటీ కూడా ఇవ్వలేకపోయింది బీఆర్ఎస్. 14 స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు మూడో స్థానానికి పరిమితమైయ్యారు. ఖమ్మం, మహబూబాబ్‌లో మాత్రమే రెండో స్థానంలో నిలిచారు. ఇక హైదరాబాద్ స్థానంలో అయితే నాలుగో స్థానానికి పరిమితమైంది ఆ పార్టీ. ఇది మాములు ట్రాక్ రికార్డ్ కాదు. ఇంకా దారుణమైన విషయం ఏంటంటే.. బీఆర్ఎస్‌కు పూర్తిస్థాయిలో పట్టున్న మెదక్ లోక్‌సభ నియోజకవర్గంలో కూడా.. ఆ పార్టీ థర్డ్ ప్లేస్‌కే పరిమితమైంది. అంటే ఆ పార్టీ క్యాడర్ దాదాపుగా బీజేపీకి షిఫ్ట్ అయినట్టు కనిపిస్తోంది. నాట్ ఓన్లీ మెదక్.. బీజేపీ గెలిచిన ప్రతి సీటులో కూడా బీఆర్ఎస్ థర్డ్ ప్లేస్‌లోనే ఉంది. ఇది నిజంగా ఆ పార్టీకి డేంజర్ బెల్స్ మోగిస్తుందని అర్థం. ఎందుకంటే ఇప్పటికే చేరాల్సిన వారంతా కాంగ్రెస్‌లో చేరారు. ఇక మిగిలిన వారంతా బీజేపీ వైపు చూస్తున్నట్టు కనిపిస్తోంది. ఇది నిజంగా బీఆర్ఎస్ మనుగడనే ప్రశ్నార్థకంలో పడేసే సిట్యూవేషన్. తెలంగాణ రాష్ట్రానికే పరిమితమైన టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చారు. ప్రాంతీయ పార్టీ నుంచి జాతీయ పార్టీగా ఎదిగి దేశ రాజకీయాల్లో చక్రం తిప్పాలని.. మహారాష్ట్ర, ఏపీలో కూడా పార్టీని విస్తరించేందుకు అన్ని రకాలుగా ప్రయత్నించారు. ఎన్డీఏ, ఇండియా కూటమిలకు ధీటుగా థర్డ్ ఫ్రంట్ వస్తుందని.. తమలాంటి ప్రాంతీయ పార్టీలే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటంలో కీలక పాత్ర పోషిస్తాయంటూ కేసీఆర్ పదే పదే చెప్పారు. కానీ ఏమైంది.. కేసీఆర్ చెప్పిన మాటలు వట్టి మాటలే అని తేలింది. ఆయన వేసిన వ్యూహాలు పూర్తిగా బెడిసికొట్టాయి. ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించటం పక్కనపెట్టండి. అసలు తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో ఖాతా కూడా తెరిచే పరిస్థితి లేనంతగా దిగజారిపోయింది. మరి హీరోగా ఉన్న బీఆర్ఎస్ జీరోగా కావటానికి కారణాలేంటి ? దీనికి ఆన్సర్ అనేకం అని చెప్పవచ్చు. ప్రభుత్వ వ్యతిరేకత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి కారణం కాగా.. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూడా బీఆర్ఎస్ పెద్దల్లో తగ్గని అహంకారం. కీలక నేతలంతా పార్టీని వీడటం.. క్షేత్రస్థాయిలో నేతలంగా డీలా పడటం.. కాంగ్రెస్, బీజేపీలు బలమైన పార్టీలుగా ఎదగడం.. ఇలా అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ఆఖరికి గులాబీ బాస్ కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగినా ప్రజలు కనీసం కూడా పట్టించుకోలేదు. ఇవేకాదు ఇంకా చాలా తప్పులు చేసింది బీఆర్ఎస్ అధిష్టానం. అభ్యర్థుల ఎంపికలో కూడా చాలా తప్పులు జరిగాయి. లాస్ట్ మినిట్‌లో కొత్త అభ్యర్థులను తెరపైకి తేవటం ఆ పార్టీని కొంప ముంచింది. వారికి క్షేత్రస్థాయిలో ఎలాంటి పట్టు లేదు. పార్టీ సింబల్ చూసి ఓట్లు వేసే పరిస్థితి ఎలాగైనా లేదు. ఇప్పుడు ఆ అభ్యర్థుల వ్యక్తిగత చరిష్మా కూడా ఉపయోగపడలేదు. ఇక కేడర్‌ను కాపాడుకోవడలో బీఆర్ఎస్ ఫెయిల్ అయ్యింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర, కీలక నేతలు కేటీఆర్, హరీశ్‌రావులు వచ్చినప్పుడు రోడ్‌షోలు నిర్వహించడం మినహా.. నియోజకవర్గ స్థాయి నాయకులు, పార్టీ ఎమ్మెల్యేలు పెద్దగా కష్టపడట్టు కనిపించలేదుఅసలు జనాల్లో బీఆర్ఎస్‌పై వచ్చిన ఆగ్రహం ఇంకా తగ్గలేదు. పార్టీ పెద్దలకు అంటుకున్న అవినీతి మరకలు ఇంకా మరిచిపోలేదు. చుట్టుకుంటున్న కేసులు.. మేడిపండు మేడిగడ్డ.. ఫోన్ ట్యాపింగ్ అరాచకాలు.. ఇలా ప్రజలకు అన్ని గుర్తున్నాయి. దానికి తగ్గట్టే తీర్పు ఇచ్చారు. ఇప్పటికే షెడ్డుకు చేరిన కారును పొరపాటున కూడా మళ్లీ రోడ్డెక్కే పరిస్థితి రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. మరో దారుణమైన పరిస్థితి ఏంటంటే.. బీఆర్ఎస్‌లో పేరుకు లీడర్లు కనిపిస్తున్నా.. క్యాడర్ మొత్తం కకావికలమవుతోంది. సో.. ఇక ముందు రాబోయే ఎన్నికల్లో ఇలాంటి పరిస్థితులు రిపీట్ అయ్యే చాన్సెస్ కనిపిస్తున్నాయి. అందుకే ఇప్పటికైనా ఆ పార్టీ పెద్దలు.. ప్రజలను తప్పుదోవపట్టిస్తూ.. ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతూ.. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాన్ని మానుకొని.. పార్టీ పునర్నిర్మాణంపై దృష్టి పెడితే బాగుంటుందన్న సలహాలు పొలిటికల్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నాయి. మరి బీఆర్ఎస్ పెద్దలు ఇప్పటికైనా మేలుకుంటారా? లేదా? చూడాలి.

## రామోజీ రావుకు తీవ్ర అస్వస్థత..

చికిత్స అందిస్తున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. అయితే గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రామోజీ రావును తాజాగా ఆస్పత్రిలో చేర్పించారు. కాగా, ఇటీవలే గుండె సంబంధిత వ్యాధుల కారణంగా ఆయనకు వైద్యులు స్టంట్స్ వేసినట్లు సమాచారం. ప్రస్తుతం 87 ఏళ్ల రామోజీ రావు ఆరోగ్య పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది. రామోజీ రావు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు హెల్త్ బులిటెన్ విడుదల చేసే అవకాశం ఉంది. వైద్యుల హెల్త్ బులిటెన్ కోసం ఆయన కుటుంబసభ్యులు, అభిమానులు, సంస్థ సిబ్బంది ఎదురుచూస్తున్నారు. మరోవైపు, రామోజీరావు తీవ్ర అస్వస్థకు గురయ్యారన్న వార్త తెలియడంతో పలువురు ప్రముఖులు, ఆయన శ్రేయోభిలాషులు స్పందిస్తున్నారు. రామోజీ రావు సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ నేత, మాజీ మంత్రి నారా లోకేష్ స్పందించారు. అస్వస్థతకు గురైన ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు గారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. ప్రజాపక్షమై అక్షరాన్ని నిలిపిన మార్గదర్శి మీరు. సంపూర్ణ ఆరోగ్యంతో నిండు నూరేళ్లు సమాజ క్షేమం కోసం మీరు పనిచేయాలని ప్రజలంతా తమ ఇష్టదైవాలను ప్రార్థిస్తున్నారు అని పేర్కొన్నారు.

# సమాచార హక్కు చట్టంను ఎలా ఉపయోగించుకోవాలి?

✍ జయభేరి, హైదరాబాదు జూన్ 7

చట్టాలు ప్రజలకు ఉపయోగపడాలి. ఆ విధంగా వాటిని అమలు చేసే వ్యక్తులు క్రియాత్మకంగా వ్యవహరించాలి. లేకపోతే ఆ చట్టము లక్ష్యం నెరవేరదు. అది నిర్వీర్యం అవుతుంది. పౌరులకు ఆచరణయోగ్యమైన సమాచార హక్కు కల్పించి, తద్వారా ప్రతి అధికార యంత్రాంగము దగ్గర ఉన్న సమాచారాన్ని పౌరులకు అందుబాటులోకి తెచ్చేందుకు, పౌరులకు ఉన్న సమాచార హక్కును చట్టబద్ధం చేసి, ప్రతి ప్రభుత్వం యంత్రాంగములో పారదర్శకత, జవాబుదారీ తనము తీసుకురావడం ఈ చట్టం ఉద్దేశ్యము అని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి అన్నారు. సమాచార హక్కు చట్టంలోని 7(6) ప్రకారము అభ్యర్థన అందిన 30 రోజుల్లోగా దరఖాస్తుదారు కోరిన సమాచారాన్ని ఇవ్వడంలో విఫలమైనప్పుడు ఫీజుతో నిమిత్తం లేకుండా ఆ సమాచారాన్ని ఉచితంగా ప్రజా సమాచార అధికారి అందించాల్సి ఉంటుంది. ఆ ఫీజు సహేతుకంగా ఉండాలి. దారిద్య రేఖకు దిగువన ఉన్నవారి నుంచి ఎలాంటి ఫీజు వసూలు చేయకూడదు అని సాయి చౌదరి తెలిపారు. అంతేకాదు సెక్షన్ 7(3) ప్రకారం సమాచారం అందించడానికి ఎక్కువ మొత్తం వసూలు చేయాలని నిర్ణయించినప్పుడు ఆ విషయాన్ని దరఖాస్తుదారునికి తెలియజేయాలి. ఆ ఫీజును మరొకసారి పరిశీలన చేయమని కోరే హక్కు దరఖాస్తుదారునికి ఉందని, అందుకున్న కాలపరిమితిని, అనుసరించాల్సిన పద్ధతులను, అప్పీలును ఎవరి ముందు దాఖలుచేయాలో ఆ వివరాలను కూడా తెలియజేయాలి. సెక్షన్ 7(9) ప్రకారం కోరిన సమాచారాన్ని దరఖాస్తుదారుడు అడిగిన రూపంలోనే అందించాలి. ఆ విధంగా కాకుండా వేరే విధంగా కూడా సమాచారాన్ని ఇచ్చే అధికారము ప్రజా సమాచార అధికారి ఉంటుంది. వనరులు ఎక్కువ ఖర్చయ్యే సందర్భంలో ఆ విషయాన్ని తెలియజేస్తూ, తక్కువ ఖర్చు అయ్యే విధంగా మరో రూపంలో ఇచ్చే అవకాశం ప్రజా సమాచార అధికారికి ఉంటుంది. ఈ చర్యలేవి తీసుకోకుండా కొన్ని వేల రూపాయల్లో, కొన్ని లక్షల రూపాయలు డబ్బు చెల్లించాలని చెప్పడం సమాచారాన్ని కోరుతున్న వ్యక్తులను నిరుత్సాహపరచడమే అవుతుంది. మరో విధంగా చెప్పాలంటే బెదిరించడం అవుతుంది. సంబంధంలేని సమాచారం ఇవ్వకుండా సంబంధించిన సమాచారం ఇస్తే అంత మొత్తం అవసరం ఉండదు. దరఖాస్తులు జాగ్రత్తగా గమనించి అవసరమైన సమాచారాన్ని ఇవ్వడానికి ప్రయత్నించవచ్చు. కానీ ఆ అధికారులు ఉద్దేశం మరో విధంగా ఉన్నప్పుడు ఇలాంటి చర్యలనే వాళ్ళు తీసుకుంటారు. ఇలాంటి చర్యలు ఎండగట్టాలంటే సమాచార హక్కు చట్టం గురించి పూర్తి అవగాహన ఉండాలి. చట్టంలోని నిబంధనలను అర్థం చేసుకుంటే ప్రజా సమాచార అధికారులు తీసుకునే ఎలాంటి చర్యలనైనా అధిగమించే పరిస్థితి ఏర్పడుతుంది. సమాచారాన్ని ఎవరైనా కోరవచ్చు. ఎందుకు కోరుతున్నారో కారణం కూడా తెలియజేయాల్సిన అవసరం లేదు. దారిద్యరేఖకు దిగువన ఉన్న వ్యక్తులు సమాచారం పొందటానికి ఎలాంటి చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ విషయములను అర్థం చేసుకుంటే అన్ని ఆటంకాలను అధిగమించే అవకాశం ఉంటుంది అని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి వివరించారు. ప్రజలు ప్రభుత్వ చర్యల్లో పాల్గొనడం వల్ల ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. ఎన్నికలు అప్పుడు మాత్రమే కాదు, రోజు వారి ప్రభుత్వ కార్యకలాపాల్లో పౌరులు పాల్గొనాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పాలసీలు, స్కీముల అమలు సక్రమంగా జరుగుతున్నవా అనే విషయం పరిశీలించాలి. ఇవి చేయాలంటే చట్టం పట్ల అవగాహన ఉండాలి. ఆ ప్రయత్నం అందరూ చేయాలి అని సాయి చౌదరి అన్నారు.




**సమాచార హక్కు చట్టంలోని 7(6) ప్రకారము అభ్యర్థన అందిన 30 రోజుల్లోగా దరఖాస్తుదారు కోరిన సమాచారాన్ని ఇవ్వడంలో విఫలమైనప్పుడు ఫీజుతో నిమిత్తం లేకుండా ఆ సమాచారాన్ని ఉచితంగా ప్రజా సమాచార అధికారి అందించాల్సి ఉంటుంది. ఆ ఫీజు సహేతుకంగా ఉండాలి. దారిద్య రేఖకు దిగువన ఉన్నవారి నుంచి ఎలాంటి ఫీజు వసూలు చేయకూడదు అని సాయి చౌదరి తెలిపారు.**

# విద్యార్థులంతా సర్కారు బడిబాట పట్టాలి

- పకడ్బందీగా కార్యక్రమం నిర్వహించాలి..!
- ప్రభుత్వ పాఠశాలల్లో పెద్ద ఎత్తున విద్యార్థులను చేర్పించాలి
- విద్యార్థుల ప్రతిభ పై వీడియోస్ రూపొందించండి
- వాట్సాప్ గ్రూపుల్లో సర్క్యులేట్ చేయండి
- పాఠశాలలను మరింత బలోపేతం చేయాలి
- ప్రైవేటుకు దీటుగా తయారు చేయాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

✍ జయభేరి, కరీంనగర్ ప్రతినిధి :

బడికి బాట కార్యక్రమంపై అధికారులతో సమీక్ష.. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ల్పాఠశాలల్లో పెద్ద ఎత్తున విద్యార్థులను చేర్పించాలని, బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. పద్ధతి ప్రకారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహణపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బడిబాట కార్యక్రమంపై పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ గ్రామాన బడిబాట కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి బడీడు పిల్లలను గుర్తించి వారి వివరాలు సేకరించాలని పేర్కొన్నారు. వారు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా కృషి చేయాలని తెలిపారు. అలాగే ప్రైవేట్ పాఠశాలల్లో 1 నుంచి ఐదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతోనూ సమావేశం నిర్వహించాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చదువుకొని అప్రేడ్ అవుతున్న ఐదు నుంచి ఆరు సంవత్సరాల ఉన్న చిన్నారులను అందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. పెద్ద ఎత్తున ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ, విద్యా బోధన, ఆటపాటలు, ప్రత్యేక కార్యక్రమాలు, విహార యాత్రలపై షార్ట్ వీడియోలు 2, 3 రోజుల్లో రూపొందించాలని ఆదేశించారు. వాటిని అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు పంపడంతో పాటు వివిధ గ్రూపుల్లో పెద్ద ఎత్తున షేర్ చేయాలని సూచించారు.
దీనిపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మంచి గుర్తింపు వచ్చే అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ షెడ్లు, టాయిలెట్స్ నిర్మాణం పనులు వేగవంతం చేయాలని, ఈ మేరకు ఈజీఎస్ ద్వారా నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. ఈ నెల 10వ తేదీ వరకు పాఠ్యపుస్తకాలు అందించడంతోపాటు యూనిఫామ్స్ విద్యాశాఖ అధికారులు సిద్ధం చేసి ఉంచాలని సూచించారు. పాఠశాలల్లో శానిటేషన్ సంబంధించిన పనులు చేపట్టాలని పేర్కొన్నారు. పాఠశాలల అభివృద్ధికి సంబంధించి అన్ని వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు శాతం తక్కువ ఉన్నచోట పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. జులైలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు షూస్ అందించే ఏర్పాట్లు చేస్తానని వెల్లడించారు. అంగన్వాడీ కేంద్రాలను సైతం మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రతిభ గల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను గుర్తించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రావు, జడ్పి సీఈఓ శ్రీనివాస్, డీపీఓ రవీందర్, డీఆర్డీఓ శ్రీధర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఇన్చార్జి మెప్మా పిడి స్వరూపారాణి, తదితరులు పాల్గొన్నారు.




## చేప ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు

తాతకు ఓ సాధువు ఈ మందు తయారీ విధానం నేర్పించి ఉచితంగా అందజేస్తే కుటుంబానికి మేలు జరుగుతుందని చెప్పడంతో అప్పటి నుంచి ఈ చేపప్రసాదం అందజేస్తున్నారు. ఇటీవలే హరినాథ్‌గౌడ్ మరణించినా... ఆయన కుటుంబ సభ్యులు ఈ ఏడాది చేపమందు పంపిణీ చేయనున్నారు.ఈ చేపప్రసాదాన్ని ఆయుర్వేద మూలికలతో పాటు పాలపిండి, ఇంగువా, బెల్లం, పసుపు మిశ్రమంతో తయారు చేస్తారు. కేవలం బావిలో ఊరిన నీటినే ఇందులో వినియోగిస్తారు. ఈ మిశ్రమాన్ని బతికి ఉన్న కొర్రమీను చేపపిల్లల నోటిలో పెట్టి ఉబ్బసం రోగం ఉన్న వారితో వాటిని నేరుగా మింగిస్తారు. అయితే తొలుత దీన్ని చేపమందుగా ప్రచారం చేసేవారు. దీనిపై ఎన్నో వివాదాలు నడిచాయి. అసలు ఇది మందే కాదని...ఉబ్బసం వ్యాధి తగ్గిస్తుందని చెప్పడానికి ఎలాంటి శాస్త్రీయ కారణాలు లేవని జనవిజ్ఞాన సంస్థ వంటివి ఆందోళనలు నిర్వహించాయి. అయినప్పటికీ బత్తిన కుటుంబం అందించే ఈ చేపమందు కోసం జనం తండోపతండాలుగా తరలివచ్చేవారు. కొన్ని సార్లు తోపులాటలు చోటుచేసుకుని పలువురు మృతిచెందిన ఘటనలు కూడా ఉన్నాయి. వ్యవహారం కోర్టు మెట్లెక్కింది. ఈ మందులో ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేకపోవడంతో దీన్ని చేపమందుగా పిలవకూడదంటూ ఆదేశాలు జారీ చేసింది. కోర్టు సూచన మేరకు అప్పటి నుంచి దీన్ని చేపప్రసాదంగా అందజేస్తున్నారు. ఎగ్జిబిషన్ మైదానంలో పంపిణీ చేసే ఈ చేపప్రసాదం కోసం ఏటా వేలాది మంది తరలివస్తుంటారు. అయితే చేపప్రసాదంలో వాడే మిశ్రమాన్ని మాత్రం బత్తిన కుటుంబం ఉచితంగానే అందిస్తున్నా...చేపలను మాత్రం ఎవరికి వారే సొంతంగా తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం ఎగ్జిబిషన్ మైదానం ఆవరణలోనే ప్రత్యేక స్టాళ్లలో కొర్రమీను చేపపిల్లలను విక్రయిస్తుంటారు. మృగశిరకార్తె నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటాయి. వర్షాలు పడుతుండటంతో పాటు చల్లగాలులకు ఆస్తమా రోగులు ఇబ్బందిపడుతుంటారు. అందుకే మృగశిరకార్తె ప్రారంభం రోజే ఈ మందు పంపిణీ చేస్తుంటారు

## ప్రజావాణి ప్రారంభం

ప్రజావాణి ఇంచార్జీ, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి వెల్లడించారు. లోక్ సభ ఎన్నికల కోడ్ వల్ల మార్చి 16 నుంచి ప్రజావాణి అర్జీల కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా పడింది. ప్రజావాణి అర్జీల స్వీకరణ కార్యక్రమం హైదరాబాద్ లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో ప్రతి వారం మంగళ, శుక్ర వారాల్లో కొనసాగుతుందని చిన్నారెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా ప్రజావాణిలో అందజేయాలని చిన్నారెడ్డి కోరారు.
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ప్రతిష్టాత్మకంగా ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇప్పటికే ఈకార్యక్రమానికి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. ప్రజల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన ఫిర్యాదుల మేరకు చర్యలు చేపట్టారు అధికారులు. పలు శాఖల్లో దాడుల చేశారు. ఇవాళ జరిగే ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులు తెలిపారు. ఇక ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ గా రాష్ట్ర మున్సిపల్ డైరెక్టర్ దివ్య వ్యవహరిస్తున్నారు. మరోవైపు ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన వినతులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వరమే పరిష్కారం చూపాలని కలెక్టర్ కలెక్టర్లు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని చెరువులు, కుంటలు, ప్రాజెక్ట్‌ల మరమ్మతుల నివేదికలు తదితర వివరాలపై వెంటనే నివేదిక సమర్పించాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు.

## పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీకి బెయిల్

జులై 30కి వాయిదా వేసింది. రాహుల్ గాంధీని స్వాగతించడానికి పార్టీ కార్యకర్తలు, అడ్వొకేట్లు కోర్టు ప్రాంగణంలోకి వచ్చారు. కోర్టు ప్రక్రియ ముగిశాక కాంగ్రెస్ కార్యకర్తలు రాహుల్ గాంధీకి అనుకూలంగా నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి శివకుమార్ ఒకే కారులో కోర్టు ప్రాంగణానికి వెళ్లారు. రాహుల్ గాంధీ చాలా హ్యాపీ మూడ్ లో కనిపించడమే కాక, కారులో నుంచి పార్టీ కార్యకర్తలకు చేయి ఊపుతూ వెళ్లారు దీనికి ముందు రాహుల్ గాంధీకి విమానాశ్రయంలో సిద్ధ రామయ్య, శివకుమార్ స్వాగతం పలికారు. ఇకపోతే రాహుల్ గాంధీపై పెట్టిన పరువు నష్టం దావా విషయానికి వస్తే... కాంగ్రెస్ తన ప్రచారంలో భాగంగా బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓ ప్రకటన ఇచ్చింది. కర్నాటకలో బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ ప్రాజెక్టులు ఇవ్వడానికి 40 శాతం కమీషన్ ఛార్జీ చేస్తుందని ఓ ఫుల్ పేజీ ప్రకటనలో పేర్కొన్నారు.

# మరమ్మత్తు పనులు త్వరతగతిన పూర్తి చేయాలి

జయభేరి, మేడిపల్లి :

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మొదటి డివిజన్ అయోధ్య కాలనీ, సుమ కాలనీలలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలలో పెండింగ్లో ఉన్న సిసి రోడ్డు, డ్రైనేజి, మంచినీటి పైప్ లైన్ మరమ్మత్తు పనులు త్వరతగతిన పూర్తి చేయాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేయడంతో సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లతో మాట్లాడి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వీలైనంత త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆనంతరం ఆశ్రయం హ్యాండ్ అఫ్ హోప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షులు బండారి రవీందర్ కలిసి ప్రారంభించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల, కాలనీ అధ్యక్షులు రమణ రెడ్డి, కైసర్, వెంకన్న, నర్సి రెడ్డి, వెంకటయ్య, గోపాల్ రెడ్డి, సోమేష్, శివ, మధుసూదన్ రెడ్డి, దుర్గయ్య, శ్రీనివాస్, యూసుఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.









# "తీన్మార్ మల్లన్న" ఎమ్మెల్సీగా ఘనవిజయం

- తీన్మార్ మల్లన్నకు శుభాకాంక్షలు తెలిపిన తుంగతుర్తి రవి
- ఎమ్మెల్సీ ఎన్నికల తుంగతుర్తి నియోజకవర్గ ప్రచారం లో తుంగతుర్తి రవి సక్సెస్
- తీన్మార్ మల్లన్న విజయం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

జయభేరి, మేడిపల్లి :

ఉమ్మడి నల్లగొండ వరంగల్ ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితాలు క్షణక్షణం ఉత్కంఠ భరితంగా సాగాయి. ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మొదటి నుండి తన ఆదిపత్యాన్ని ప్రదర్శిస్తూ భారీ మెజార్టీతో విజయకేతనాన్ని ఎగరేశారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపుమేరకు ఎమ్మెల్సీ ఎన్నికలలో తీన్మార్ మల్లన్నకు మద్దతుగా తుంగతుర్తి నియోజకవర్గ కోఆర్డినేటర్ గా ప్రచార బాధ్యతలు చేపట్టిన పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న ఘన విజయం సాధించిన నేపథ్యంలో తీన్మార్ మల్లన్నకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తుంగతుర్తి రవి మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్న భారీ మెజార్టీతో గెలవడం చాలా సంతోషకరమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నిరుద్యోగులకు యువకులకు తీన్మార్ మల్లన్న ఎల్లప్పుడూ అండగా ఉంటాడని, గత నెల రోజులుగా తీన్మార్ మల్లన్న విజయం కోసం నిరంతరం కృషి చేసిన తుంగతుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నేతలకు, భారీ మెజార్టీతో గెలిపించిన పట్టభద్రులకు, తనతో పాటు తుంగతుర్తి నియోజకవర్గంలో పర్యటించిన పీర్జాదిగూడ కాంగ్రెస్ నాయకులకు, మల్లన్న విజయంలో తోడ్పాటును అందించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని తుంగతుర్తి రవి అన్నారు.

# అనుమానాస్పదంగా మతిస్థిమితం లేని వివాహిత మహిళా మృతి



జయభేరి, దేవరకొండ :

అనుమానాస్పద రీతిలో ఓ మతి స్థిమితం లేని వివాహిత మహిళా మృతి చెందిన ఘటన దేవరకొండ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం లింగోటం గ్రామానికి చెందిన దుబ్బ శోభ (45) మతిస్థిమితం సరిగా లేకపోవడంతో రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెల్లి ఇంటికి వెళ్ళలేదు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారని, శుక్రవారం పట్టణంలోని మార్కెట్ యార్డు పక్కన మురికి కాలువలో మహిళా మృతదేహం ఉందని స్థానికులు తెలిపిన సమాచారంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నామని, హత్య లేక ఆత్మహత్య వివరాలు సేకరించి, విచారించి, మతిస్థిమితం లేకపొతే కాలువలో పడి మరణించినట్లు నిర్ధారించి కుటుంబ సభ్యుల మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దేవరకొండ సిఐ నరసింహులు తెలిపారు.

# ఉత్తమ అవార్డు గ్రహీత కు సన్మానం



జయభేరి, దేవరకొండ :

వివిధ రంగాల్లో విశిష్ట సేవలను గుర్తించి సేవ రత్న జాతీయ అవార్డు 2024 అవార్డు పొందడం చాలా సంతోషం కలిగిస్తుందని కొర్ర కిషన్ నాయక్ తెలిపారు. శుక్రవారం వివిధ సంఘాలు, రాజకీయ పార్టీలా నాయకుల ఆధ్వర్యంలో అవార్డు గ్రహీతకు సన్మానించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముద్దిగొండ ఎల్లేష్ మాదిగ, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రామావత్ రమేష్ నాయక్, గిరిజన ఉద్యోగ సంఘాల నాయకులు రవి నాయక్, రూప్ల నాయక్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత కు అభినందించారు. ముందు ముందు మంచి సేవా కార్యక్రమాలు చేసి ఇంకా పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలని సూచించారు.



# గ్రూప్1 పరీక్షలకు ప్రత్యేక బస్సులు..

జయభేరి, మేడిపల్లి :

ఈనెల 9న జరగనున్న గ్రూప్1 పరీక్షల నిమిత్తం హాజరయ్య అభ్యర్థుల కొరకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ చెంగిచెర్ల డిపో మేనేజర్ కే కవిత తెలిపారు. ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఆదివారం జరగనున్న గ్రూప్1 పరీక్షలకు హాజరుకానున్న అభ్యర్థుల కొరకు సంస్థ ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు తెలిపారు. ఘట్ కేసర్ తో పాటు ఇతర ప్రాంతాలకు చెంగిచెర్ల డిపో పరిధిలోని అన్ని ప్రాంతాల నుండి నగరానికి ప్రత్యేక బస్సులు నడుస్తాయని చెప్పారు. ఒకే చోట నుండి 40 మందికి పైగా పరీక్షలు రాసే అభ్యర్థులు ఉన్నచో వారు ఉన్న చోటు నుండి ఎగ్జామ్ సెంటర్ వరకు స్పెషల్ ఆపరేషన్ బస్సులను నడపనున్నట్లు, గ్రూప్1 ఎగ్జామ్స్ రాసే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు.

# నిలిచిపోయిన మెట్రో ట్రైన్స్

జయభేరి, హైదరాబాద్, జూన్ 7 :

హైదరాబాద్ మెట్రో రైళ్లు మియాపూర్ ఎల్బీ నగర్ మార్గంలో నిలిచిపోయాయి. సాంకేతిక కారణాలతోనే రెడ్ లైన్‌లో రైళ్లను నిలిపివేసినట్లుగా మెట్రో రైలు లోకో పైలట్లు చెబుతున్నారు. హైదరాబాద్ లో అసలే భారీ వర్షం కురియడంతో విపరీతమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో చాలా మంది రోడ్డు మార్గం ద్వారా కాకుండా మెట్రో రైళ్లను ఆశ్రయిస్తున్నారు. ఇంతలో రైళ్ల రాకపోకలు ఆగిపోవడంతో స్టేషన్లు అన్నీ ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. అటు ఎల్బీ నగర్ మెట్రోలో ఎగ్జిట్ మెషిన్లు కూడా పని చేయడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. అయితే, వెంటనే సమస్యను పరిష్కరించినట్లుగా ఎల్ అండ్ టీ మెట్రో రైలు సంస్థ ప్రకటించింది. ఓ చిన్న లోపం కారణంగా రైళ్లు నిలిచాయని.. ఆ సమస్యను 7 నిమిషాల్లోనే పరిష్కరించామని వెల్లడించింది. ఈ మేరకు ఎక్స్ ద్వారా ఓ ప్రకటన విడుదల చేసింది. చిన్న అంతరాయం వేగంగా పరిష్కరించాం. హైదరాబాద్ మెట్రో రైలు సర్వీసులకు ఈ సాయంత్రం స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఎంజీబీఎస్ వద్ద ట్రాన్స్ కో ఫీడర్ ట్రిప్పింగ్ అవ్వడం వల్ల ఈ సమస్య వచ్చింది. ఈ సమస్యను మా టీం 7 నిమిషాల్లోనే పరిష్కరించింది. మియాపూర్ వద్ద ఉన్న మరొక ఫీడర్‌కు కనెక్ట్ చేశాం. తద్వారా మెట్రో రైలు సర్వీసులు కాసేపట్లో ఇక యథావిధంగా నడుస్తాయి. మీకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం. ప్రయాణికుల సౌకర్యమే మా మొదటి ప్రాధాన్యత" అని ఎల్ అండ్ టీ మెట్రో రైలు సంస్థ ఎక్స్‌లో ఓ ప్రకటన విడుదల చేసింది.

# కార్పొరేట్ విద్యాసంస్థల కబంధహస్తల్లో నలిగిపోతున్న ఇంటర్ బోర్డు

- ఇంటర్ బోర్డు అక్రమాలకు పుట్టలుగా, అవినీతికి బుట్టలుగా మారింది

జయభేరి, హైదరాబాద్ :

**నారాయణ, శ్రీచైతన్య ఇతర కార్పొరేట్ విద్యాసంస్థలు వివిధ కోర్సుల పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తున్న నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ఇంటర్ విద్యాశాఖాధికారులు. కార్పొరేట్ విద్యాసంస్థల అనుమతులు ఒక దగ్గర తరగతులు మరొక దగ్గర నిర్వహిస్తున్న వైనం, విద్యార్థుల జీవితాలతో చెలగాటం, మార్కులు, ర్యాంకులే వారి లక్ష్యం. కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న దారుణాలను న్యాయస్థానాలు సుమోటాగా తీసుకుని విచారణ జరపాలి. కార్పొరేట్ విద్యాసంస్థల ఫీ "జులుం" పై లేని ప్రభుత్వ కొరడా! ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్.**




రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రించాలని, ఇంటర్ బోర్డు అనుమతి లేని కళాశాలల జాబితాను బహిర్గతం చేయాలనీ, ప్రభుత్వ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులు భర్తీ చేసి, మౌలిక వసతులు కల్పించాలని, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా విద్యార్థుల నుండి వివిధ కోర్సుల పేర్లతో లక్షల రూపాయలు వసూలు చేస్తున్న కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నాంపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయం ముట్టడించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలల ఫీజులు దోపిడీ అరికట్టాలని, అనుమతులు ఒక చోట, తరగతులు మరోచోట నిర్వహిస్తూ.. విద్యార్థుల జీవితాలతో చెలగాట మాతున్నాయని, విద్యార్థుల సంక్షేమం పట్టించుకోకుండా మార్కులు, ర్యాంకులే వారి లక్ష్యం అని విమర్శించడం జరిగింది. నారాయణ, శ్రీచైతన్య ఇతర కార్పొరేట్ విద్యాసంస్థలు ఆకర్షణీయమైన కోర్సుల పేర్లతో లక్షల రూపాయలు వసూలు చేస్తూ, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నప్పటికీ, వారిపై కనీసం పర్యవేక్షణ లేకపోవడం, ఇంటర్ నిబంధనలు పాటించకుండా, ఫైర్ సేఫ్టీ, బిల్డింగ్ లకు ఎటువంటి నాణ్యత ప్రమాణాలు లేకుండా, వ్యాపార సముదాయాలు నిర్వహించే వాటిలో తరగతులు నిర్వహిస్తున్నారని, ఏదైనా ప్రమాదం సంభవిస్తే విద్యార్థులను కాపాడలేని పరిస్థితిలో కార్పొరేట్ కళాశాలలు నడుపుతున్నారు. ఇప్పటికైనా ఇంటర్ నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకొని, అనుమతులు లేని కళాశాలల జాబితాను బహిర్గతం చేయాలనీ డిమాండ్ చేయడం జరిగింది. కార్పొరేట్ కళాశాలల్లో జరిగే దారుణాలను న్యాయస్థానాలు సుమోటాగా స్వీకరించి విచారణ చేపట్టాలని కోరడం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ కళాశాలలో ఉన్న సమస్యలు పరిష్కరించి, ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. అనంతరం విద్యార్థి నాయకులను అరెస్ట్ చేసి బేగంబజార్ పోలీస్ స్టేషన్ కి తరలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు గ్యార నరేష్, గ్యార క్రాంతి, రఘు రామ్, నాగ జ్యోతి, రెహమాన్, నెల్లి సత్య, బరిగెల వెంకటేష్, లెనిన్ రాష్ట్ర నాయకులు మదుపల్లి లక్ష్మణ్, శృతి, శివ, వంశీ, చైతన్య, అన్వర్, హరీష్, చిన్న, యూనస్, అరుణ్, వినోద్, సాయి, పార్థసారథి, దత్తురెడ్డి, సన్నీ, శ్రీకాంత్, శివ తదితరులు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేషన్ ఎన్నికల్లో భారీగా చెల్లని ఓట్లు

జయభేరి, వరంగల్, జూన్ 7

గ్రాడ్యుయేట్ ఉప ఎన్నికలో తమ ఓటు హక్కును సక్రమంగా వేయలేకపోవడంతో చెల్లని ఓట్లుగా పోలయ్యాయి. ప్రజాస్వామ్యానికి పునాదిగా భావించే ఓటు హక్కును వినియోగించుకునే విషయంలో ఎన్నికల సంఘం, ఎన్నికల అధికారులు అనేక రకాలుగా అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాధాన్యత ఓటు వేసే విషయంలో ఎన్నికల సంఘం పెద్ద ఎత్తున ప్రచారం చేసినా పట్టభద్రులు సరిగా ఓటువేయలేకపోయారు. గ్రాడ్యుయేట్లు ఓట్లు ఎలా వేయాలనే అంశంపై అటు ఎన్నికల కమిషన్ అనేక అవగాహన కార్యక్రమాలను చేపట్టింది. ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేశారు. పోటీచేసిన అభ్యర్థులు కూడా తమ వంతు ప్రయత్నం చేశారు. నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఏకంగా 25,877 ఓట్లు చెల్లకుండా పోయాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రధాన అభ్యర్థులతో సమానంగా చెల్లని ఓట్లే ఐదో స్థానంలో ఉన్నాయి. ఓటు వేయడంలో ఫెయిల్ కావడంతో మొదటి ప్రాధాన్యత ఓట్లతో అభ్యర్థుల గెలుపు అవకాశాలకు దూరమయ్యారు.

ఈ నియోజకవర్గంలో 46,300 పట్టభద్రుల ఓట్లు ఉండగా 3,36,013 ఓట్లు పోలయ్యాయి. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి ఏకంగా 25,877 ఓట్లు చెల్లకుండా పోయాయి. మొదటి ప్రాధాన్యత ఓట్లలో తీన్మార్ మల్లన్న (కాంగ్రెస్) 1,22,813 ఓట్లు, రాకేశ్ రెడ్డి (బీఆర్ఎస్) 1,04,248 ఓట్లు, ప్రేమేందర్ రెడ్డి (బీజేపీ) 43,313 ఓట్లు, అశోక్ కుమార్ (స్వతంత్ర) 29,697 ఓట్లు రాగా ఐదో స్థానంలో 25,877 చెల్లని ఓట్లు వచ్చాయి. ప్రధాన అభ్యర్థులైన ప్రేమేందర్ రెడ్డి, అశోక్ కుమార్‌కు వచ్చిన ఓట్లతో సమానంగా చెల్లని ఓట్లు బయట పడటం ఎన్నికల అధికారులను విస్మయానికి గురిచేసింది. మొదటి ప్రాధాన్యత ఓట్లలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు వచ్చిన మెజారిటీ 18,565 ఓట్లు ఉండగా, అంతకంటే ఎక్కువ సంఖ్యలో చెల్లని ఓట్లు ఉండడంతో ప్రధాన అభ్యర్థులకు మొదటి ప్రయారిటీ ఓట్ల ద్వారా విజయావకాశాలు దూరమయ్యాయి.



## నేడు మేడిగడ్డలో పర్యటించనున్న మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

**జయభేరి, హైదరాబాద్, జూన్ 07:**

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇవాళ మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనున్నారు. మేడి గడ్డతో పాటు అన్నారం, సుందిళ్ల ఆనకట్ట మరమ్మ తులను ఉత్తమ్ సమీక్షించ నున్నారు. ఎన్డీఎస్ఏ కమిటీ సిఫార్సు ల మేరకు చేప డుతున్న చర్యల పురోగతిని తెలుసుకోనున్నారు. నీటిపారుదలశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్ కుమార్, ఇతర ఇంజినీర్లతో కలిసి పనులపై ఆరా తీయను న్నారు. మరోవైపు జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ నిపుణుల కమిటీ మధ్యంతర నివేది కలో చేసిన సిఫార్సులకు అనుగుణంగా మేడిగడ్డతో పాటు అన్నారం, సుందిళ్ల ఆనక ట్టల వద్ద మరమ్మతు లు, రక్షణ చర్యలకు సంబంధించిన పనులు కొనసాగుతు న్నాయి. మేడిగడ్డ ఆనకట్టలో కీలక మైన గేట్ల ఎత్తివేత పనులు చేస్తున్నారు. ఏడో బ్లాకు లోని ఎనిమిది గేట్లకు గాను ఒక గేటును గతంలోనే ఎత్తగా... కుంగిన పియర్స్ మధ్యలో ఉన్న గేటును కటింగ్ ద్వారా తొలగిస్తు న్నారు. మిగిలిన ఆరు గేట్లలో 16, 17వ గేట్లను ఎత్తినట్లు ఇంజనీర్లు తెలిపారు. గతంలో 16వ గేటు తెరిచే సమయంలో సాంకేతిక సమస్యలు వస్తే ఆపివేసి... అన్నింటిని సరిచేసిన తర్వాత గురువారం ఎత్తారు. మరో నాలుగు గేట్లను కూడా తెరవాల్సి ఉంది. ఇదే తరహాలో ఆ గేట్లను కూడా తెరిచే ప్రయత్నం చేస్తున్నారు.

## పబ్లిక్ సర్వీస్ కమిషన్ లో ఉద్యోగాలు

**జయభేరి, హైదరాబాద్, జూన్ 7:**

హైదరాబాద్‌లోని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. ఈ ఖాళీలను డిప్యూటేషన్ విధానంలో భర్తీ చేయనున్నారు. పోస్టులవారీగా విద్యార్హతలు నిర్ణయించారు. బీటెక్, ఎంటెక్, ఎంసీఏ విద్యార్హతతోపాటు సంబంధిత విభాగాల్లో కనీసం ఏడాది నుంచి 5 సంవత్సరాల అనుభవం ఉన్నవారు దరఖాస్తుకు అర్హులు. సరైన అర్హతలు, అనుభవం ఉన్నవారు ఆఫ్‌లైన్ విధానంలో జూన్ 20లోగా దరఖాస్తులు సమర్పించవచ్చు. అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవాలి. దరఖాస్తుకు నింపి, అవసరమైన అన్ని డాక్యుమెంట్లను జతచేసి నిర్ణీత గడువులోగా సంబంధిత చిరునామాలో సమర్పించాలి. అర్హతలు, అనుభవం ఆధారంగా ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపికచేస్తారు.




### వివరాలు..

**టీఎస్‌పీఎస్సీలో ఉద్యోగాలు (డిప్యూటేషన్)**
**ఖాళీల సంఖ్య:** 06.

**చీఫ్ ఇన్‌ఫర్మేషన్ ఆఫీసర్**
**పోస్టుల సంఖ్య:** 01.
**అర్హత:** ఎంటెక్ (సీఎస్ఈ/ఐటీ) లేదా ఎంసీఏ లేదా ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్).
**అనుభవం:** ఐటీ విభాగంలో కనీసం 5 సంవత్సరాలు పనిచేసిన అనుభవం ఉండాలి.
**జీతం:** రూ.1,06,990 రూ.1,58,380.

**చీఫ్ ఇన్‌ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్**
**పోస్టుల సంఖ్య:** 01.
**అర్హత:** ఎంటెక్ (సీఎస్ఈ/ఐటీ) లేదా ఎంసీఏ లేదా ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్).
**అనుభవం:** నెట్‌వర్క్ సెక్యూరిటీ/సైబర్ సెక్యూరిటీ విభాగంలో కనీసం 5 సంవత్సరాలు పనిచేసిన అనుభవం ఉండాలి.
**జీతం:** రూ.1,06,990 రూ.1,58,380.

**సీనియర్ నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్**
**పోస్టుల సంఖ్య:** 01.
**అర్హత:** బీటెక్ (సీఎస్ఈ/ఐటీ) లేదా ఎంసీఏ లేదా ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్).
**అనుభవం:** నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో కనీసం 3 సంవత్సరాలు పనిచేసిన అనుభవం ఉండాలి.
**జీతం:** రూ.45,960 రూ.1,24,150.

**జూనియర్ నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్**
**పోస్టుల సంఖ్య:** 01.
**అర్హత:** బీటెక్ (సీఎస్ఈ/ఐటీ) లేదా ఎంసీఏ లేదా ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్).
**అనుభవం:** నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో కనీసం ఏడాది పనిచేసిన అనుభవం ఉండాలి.
**జీతం:** రూ.43,490 రూ.1,18,730.

**సీనియర్ ప్రోగ్రామర్**
పోస్టుల సంఖ్య: 01.
**అర్హత:** బీటెక్ (సీఎస్ఈ/ఐటీ) లేదా ఎంసీఏ లేదా ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్).
అనుభవం: ప్రోగ్రామింగ్‌లో కనీసం 3 సంవత్సరాలు పనిచేసిన అనుభవం ఉండాలి.
**జీతం:** రూ.54,220 రూ.1,33,630.

**జూనియర్ అడ్మినిస్ట్రేటర్**
**పోస్టుల సంఖ్య:** 01.
**అర్హత:** బీటెక్ (సీఎస్ఈ/ఐటీ) లేదా ఎంసీఏ లేదా ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్).
అనుభవం: ప్రోగ్రామింగ్‌లో కనీసం 3 సంవత్సరాలు పనిచేసిన అనుభవం ఉండాలి.
**జీతం:** రూ.42,300 రూ.1,15,270.

**దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా. అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవాలి. దరఖాస్తుకు నింపి, అవసరమైన అన్ని డాక్యుమెంట్లను జతచేసి హైదరాబాద్, ప్రతిభా భవన్‌లోని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలో సమర్పించాలి.
**ఎంపిక విధానం:** అర్హతలు, అనుభవం ఆధారంగా ఎంపికచేస్తారు.

# ప్రతి ఇంట్లో ఓ కళాఖండం ఉండాలి

- 3 రోజుల ఇండియా ఆర్ట్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- ముంబై, ఢిల్లీలో 20 ఎడిషన్ల తర్వాత ఇప్పుడు హైదరాబాద్‌కు వచ్చిన ఇండియా ఆర్ట్ ఫెస్టివల్
- కళ అందరికీ అందుబాటులో ఉండాలి. ప్రతి ఇంట్లో ఓ కళాఖండం ఉండాలి: మంత్రి జూపల్లి కృష్ణారావు
- కళ అందరికీ సంబంధించినది. కళ ఏకీకృత అంశం: పార్వతి రెడ్డి, అతిథి, ఆర్ట్ కలెక్టర్


**జయభేరి, హైదరాబాద్, జూన్ 07 :**




తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు 3 రోజుల ఇండియా ఆర్ట్ ఫెస్టివల్‌ని ర్వతి రెడ్డి, ఆర్ట్ కలెక్టర్, NAR ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ కె. లక్ష్మా గౌడ్, ప్రముఖ కళాకారుడు, అంజు పొద్దార్ ఆర్ట్ కానాయిజర్, రచయిత, రాజేంద్ర పాటిల్, ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ వ్యవస్థాపక డైరెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. ముంబై, ఢిల్లీలో 20 ఎడిషన్ల తర్వాత, భారతదేశ సమకాలీన కళా ఉత్సవం ఇప్పుడు హైదరాబాద్‌కు వచ్చింది. నగరంలో ఇది మా తొలి ప్రదర్శన. ఇక నుంచి హైదరాబాద్‌లో ఇది వార్షిక వ్యవహారంగా ఉంటుందని ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ వ్యవస్థాపక డైరెక్టర్ రాజేంద్ర పాటిల్ తెలిపారు. ప్రస్తుతం గుడి మల్కాపూర్ రోడ్డులోని కింగ్స్ కోహినూర్ కన్వెన్షన్‌లో ఈ ఉత్సవం జరుగుతోంది. కళ అందరికీ అందుబాటులో ఉండాలి. ప్రతి ఇంట్లో ఒక కళాఖండం ఉండాలి అని మంత్రి జూపల్లి కృష్ణారావు, తెలంగాణ ప్రభుత్వం ఎక్సైజ్, ప్రొహిబిషన్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి అన్నారు. ప్రతి ఇంటిలో అందమైన ల్యాండ్‌స్కేప్ పెయింటింగ్, పెయింటింగ్, నైరూప్య కళ లేదా శిల్పం, కళాఖండం లేదా ఫోటో ఉండాలి. అవి ఆ స్థలాన్ని ప్రకాశవంతం చేస్తాయి. కేంద్ర బిందువును సృష్టిస్తాయి. ఇది మంచి అనుభూతిని అందిస్తూనే, కళాకారులకు కూడా సహాయపడుతుంది. అనేక కళలు, చేతిపనుల రూపాలు కనుమరుగవుతున్నాయి. ఇది వాటిని పునరుద్ధరించడానికి కూడా సహాయపడుతుంది. మొత్తంమీద, కళాకారులు, కళాకారులకు ప్రోత్సాహం అవసరం. ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ తప్పనిసరిగా సందర్శించవలసిన పండుగ. నేను తీరికగా రేపు మళ్లీ సందర్శించి కొంత కళను కొంటాను. ఇండియా ఆర్ట్ ఫెస్టివల్‌ను సందర్శించి యువకులు, వర్ధమాన కళాకారులను ప్రోత్సహించాలని నేను అన్ని కార్పొరేట్ సంస్థలకు, నా మంత్రి సహచరులకు మరియు బ్యూరోక్రాట్‌లకు కూడా విజ్ఞప్తి చేస్తున్నాను. రాష్ట్రంలో కళలు, చేతివృత్తుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది. అతిథి పార్వతీరెడ్డి మాట్లాడుతూ.. కళలు అందుబాటులో ఉండాలన్నారు. కళ అందరికీ సంబంధించినది. కళ ఏకీకృత అంశం. కళ ప్రజలను బంధిస్తుంది. ఇది స్థలాన్ని వెలిగిస్తుంది. కళా సంస్కృతిని పెంపొందించుకోవాలి. ఇలాంటి ఉత్సవాలు యువకులు, ప్రతిభావంతులు, వర్ధమాన కళాకారులు తమ కళాఖండాలను ప్రదర్శించేందుకు సహాయపడతాయి. ఇది ప్రజలకు చేరువ కావడానికి వారికి ఒక వేదికను కూడా అందిస్తుంది.

కె. లక్ష్మా గౌడ్, ప్రముఖ కళాకారుడు మాట్లాడుతూ.. కళ అనేది నైపుణ్యం, ప్రతిభ, ఊహల వ్యక్తీకరణ ద్వారా సృష్టించబడిన దృశ్య వస్తువు లేదా అనుభవం అని అన్నారు. ప్రదర్శనను హైదరాబాద్‌కు తీసుకొచ్చిన నిర్వాహకులను అభినందించారు. ఇండియా ఆర్ట్ ఫెస్టివల్‌లో 30 గ్యాలరీలు, 250 మంది కళాకారులు తమ 3500 కళాఖండాలు, 100 స్టాల్స్ లో ప్రదర్శిస్తున్నారు. ఫెస్టివల్‌లో మూడు రోజులపాటు లైవ్ మ్యూజిక్‌తో కూడిన ఫ్యూజన్ షో మధ్యాహ్నం 3.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది. భారతీయ కళల ద్వారా 12000 సంవత్సరాల ప్రయాణం అయిన ది ఎటర్నల్ కాన్వాస్ యొక్క చలనచిత్ర ప్రదర్శన సాయంత్రం 6 నుండి 7.15 గంటల మధ్య జరుగుతుంది. ఇవి ప్రతి రోజు జరుగుతాయి.

శుక్రవారం నుండి ఆదివారం వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవం ఉదయం 11 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంటుంది. ఆర్కిటెక్ట్స్, ఇంటీరియర్ డిజైనర్లు ఆహ్వానించబడ్డారు. కానీ సాధారణ ప్రజలకు, ఒక్కొక్కరికి రూ. 299/ ప్రవేశ రుసుము ఉంది. టిక్కెట్లు Bookmyshow.comలో ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. మూడు రోజుల్లో 15000 మంది కళాభిమానులు ఈ ఉత్సవాన్ని సందర్శిస్తారని అంచనా. తెలంగాణ శిల్పులు, కళాకారులు, గణేష్ కుమార్ మల్తుర్కర్, ది బాంబే ఆర్ట్ సొసైటీ, కలర్ కాన్వాస్, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ, ఫ్యూజన్ షో, ది బాంబే ఆర్ట్ సొసైటీ, సమ కాంత రెడ్డి, ప్రియా ఆర్ట్, కాన్వాస్ డ్రీమ్స్ ఆర్ట్ గ్యాలరీ, ది ఇండియన్ ఆర్ట్ వంటి కొన్ని ప్రదర్శనలు ఉన్నాయి. కాటేజ్, OM తాడ్కర్, స్టూడియో టైగర్‌వాలా BOA గ్యాలరీ, అనేక ఇతరులు వారి కళలను ప్రదర్శిస్తున్నారు.






# మళ్లీ 10 ఏళ్ల తర్వాత సంకీర్ణం



లోక్‌సభ ఎన్నికల ఫలితాలు దేశాన్ని మరోసారి సంకీర్ణ రాజకీయాల యుగంలోకి తీసుకెళ్లాయి. పదేళ్ల తర్వాత ఓటర్లు ఏ పార్టీకి మెజారిటీ ఇవ్వకుండా తీర్పు చెప్పారు. దాంతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు కాబోతోంది. ఈసారి ఓటర్లు బీజేపీకి 240 సీట్లే కట్టబెట్టడంతో కొంత నిరాశ ఎదురైనా ఎన్డీఏకు మెజారిటీ రావడంతో కమలనాథులు సంతృప్తి పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీజేపీ సొంతంగా 272 సీట్ల మెజారిటీకి మార్క్ చేరుకోలేకపోయినా, ఎన్డీఏ కూటమిగా 292 సీట్లు సాధించింది. దాంతో సునాయాసంగా కేంద్రంలో సర్కారు ఏర్పాటు చేయబోతోంది. 2014, 2019 ప్రభుత్వాలకు భిన్నంగా నరేంద్రమోడీ తన పాలనలో మార్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడబోతోంది. ఎన్డీఏలో కీలక భాగస్వాములుగా మారిన టీడీపీ, జేడీయూ, ఎల్‌జేపీ, షిండే శివసేన, ఎన్సీపీ తదితర పార్టీల అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వాన్ని నడపాల్సిందే. అయితే బీజేపీకి మెజారిటీ మార్క్ దాటకపోవడానికి గల కారణాలపైనా విస్తృతంగా చర్చ జరుగుతోంది. ప్రధానంగా యూపీలో ఠాకూర్లు, గుజ్జర్లు బీజేపీకి అండగా నిలబడలేదని తెలుస్తోంది. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను మారుస్తారనే విపక్షాల ప్రచారం ఠాకూర్లకు ఆగ్రహం తెప్పించడం వల్లే బీజేపీకి సీట్లు తగ్గాయని అంటున్నారు. అలాగే మహారాష్ట్రలో శివసేన, న్సీపీ పార్టీలను చీల్చడ మహారాష్ట్ర ఓటర్లకు ఆగ్రహన్ని తెప్పించాయి. దాని ఫలితంగా బీజేపీకి ఆశించిన ఫలితాలు దక్కలేదు. వీటికి తోడు బీజేపీ రిజర్వేషన్లు రద్దు చేస్తుందని, రాజ్యాంగాన్ని మారుస్తుందని కాంగ్రెస్ సహా ఇండియా కూటమి చేసిన ప్రచారం దెబ్బ హిందీ రాష్ట్రాలలో బిజెపి స్ట్రయిక్ రేటును తగ్గించింది. ఇటు ఇండియా కూటమి అనూహ్యంగా పుంజుకుని బలమైన ప్రతిపక్షంగా అవతరించింది. ఇండియాకు 234 సీట్లు తెచ్చుకుని మెజారిటీ మార్క్‌కు దూరంగా ఆగిపోయింది. అ. విపక్షంలో కూర్చుంటామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించకపోవడంతో, ఆ కూటమి అధికారం కోసం ప్రయత్నిస్తుందనే చర్చ జరుగుతోంది. మెజారిటీకి 38 సీట్లు తక్కువగా ఉండడంతో నితీష్, చంద్రబాబు మద్దతు కోసం ఇండియా కూటమి తెరవెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయంటున్నారు. ఏ పార్టీకి సొంతంగా మెజారిటీ రాకపోవడంతో కేంద్రంలో అస్థిరత కొనసాగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గ్జిట్ పోల్స్, ఎగ్జాయిట్ పోల్స్ కు వ్యత్యాసం కనిపించింది. పదేళ్లు పూర్తి మెజారిటీతో ఉన్న బీజేపీ బడ్జెట్ కేటాయింపుల విషయంలో ఎటువంటి ఒత్తిళ్లకు గురికాలేదు. కానీ ఇప్పుడు సంకీర్ణ ప్రభుత్వం కాబట్టి మిత్రపక్షాల నుంచి ఒత్తిడి ఉంటుంది. ఈ సారి బడ్జెట్ ఏ విధంగా ఉండబోతోందనే దానిపై సర్వత్రా చర్చ జరగుతోంది. గత బడ్జెట్ వరకు ఎన్డీయే ప్రభుత్వం దృష్టి అంతా ఆర్థిక వ్యవస్థ వృద్ధిపైనే నిలిపింది. కానీ ఇప్పుడు మిత్రపక్షాలకు కానుకలు ఎక్కువ ఇవ్వాల్సి రావచ్చని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీయే మూడో సారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. కొత్త ప్రభుత్వం జూలైలో 202425 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తి బడ్జెట్ పెడుతుంది. ఎగ్జిట్ పోల్స్ కు అనుగుణంగా సీట్లు వస్తే పరిస్థితి మరోలా ఉండేది. ప్రభుత్వం మొత్తం బడ్జెట్ మూలధన వ్యయంపై దృష్టి పెట్టేది. కానీ ఇప్పుడు పరిస్థితులు భిన్నంగా మారాయి. సంకీర్ణ ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడబోతోంది, ఇటువంటి పరిస్థితిలో ప్రభుత్వ ఎజెండాలో కూడా మార్పు కనిపిస్తుంది. విశ్లేషకుడు శైలేంద్ర భట్నాగర్ ఈ సారి మోడీ ప్రభుత్వం పెట్టే బడ్జెట్ 202425లో ఏమి భిన్నంగా కనిపించవచ్చో వివరించారు. సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటైంది కాబట్టి బడ్జెట్‌లో దాని ప్రభావం కనిపిస్తుందని అన్నారు. అయితే, లోక్‌సభ ఎన్నికలకు ముందు పీఎం మోడీ తన ప్రభుత్వం మూడోసారి ఎన్నికైతే భారత ఆర్థిక వ్యవస్థపై ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. కానీ ఫలితాలు ప్రభుత్వాన్ని ఆలోచనలో పడేశాయి. ఆర్థిక వ్యవస్థ వేగానికి సంబంధించి మోడీ ప్రభుత్వం వెనుకడుగు వేసే మూడ్‌లో లేనట్లు కనిపిస్తోంది. ఎన్నికల ఫలితాల అనంతరం జాతిని ఉద్దేశించి మోడీ ప్రసంగిస్తూ, భారత ఆర్థిక వ్యవస్థను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని, దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మారుస్తామని హామీ ఇచ్చారు. అయితే, ఈ ఏడాది పూర్తి బడ్జెట్‌లో మోడీ మహిళలు, రైతులు, యువత కోసం పెద్ద ప్రకటనలు చేస్తారనడంలో ఎలాంటి సందేహంలేదు.

*పీఎం ఆవాస్ మోజన కింద 3 కోట్ల ఇళ్లు నిర్మించామని, వచ్చే ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో మరో 2 కోట్లు నిర్మిస్తామని చెప్పారు *గర్భాశయ క్యాన్సర్ నివారణకు వ్యాక్సినేషన్‌ను ప్రోత్సహిస్తాం, 914 సంవత్సరాల బాలికలకు ఉచిత వ్యాక్సినేషన్ చేస్తామని వివరించారు. *ఇప్పటి వరకు కోటి మంది మహిళలను లక్ పతి దీదీగా మార్చారు. ఈ లక్ష్యాన్ని 2 కోట్ల నుంచి 3 కోట్లకు పెంచారు. *PM గతి శక్తి కింద 3 కొత్త కారిడార్లు నిర్మిస్తాం, రాబోయే 10 సంవత్సరాల్లో విమానాశ్రయాల సంఖ్య 149 కి పెంచుతాం.

*వందే భారత్‌కు చెందిన 40,000 బోగీలను అప్‌గ్రేడ్ చేస్తాం. మెట్రో, నమో భారత్ ఇతర నగరాలకు అనుసంధానిస్తాం. లోక్ సభ ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో కొత్తగా ఏవైనా చేరుస్తారని భావిస్తున్నారు. సామాన్యులకు పన్ను రాయితీ, రైతుల కోసం ప్రత్యేక ప్రకటనలు, ఇదే కాకుండా, ప్రధానమంత్రి ఉజ్వల పథకం వంటి ఇతర పథకాన్ని తీసుకురావచ్చు. అయితే, వీటితో పాటు, ఆర్థిక వ్యవస్థ వేగాన్ని కొనసాగించేందుకు మోడీ ప్రభుత్వం మౌలిక సదుపాయాలు, తయారీ రంగంపై దృష్టి పెడుతుంది. నరేంద్రమోడీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రింగా ఇప్పటివరకు పూర్తి మెజారిటీ ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని నడిపారు. తొలిసారిగా సంకీర్ణ ప్రభుత్వానికి నేతృత్వం వహించబోతున్న నరేంద్ర మోదీ ఆ దిశగా పట్టువిడుపులతో, భాగస్వాముల ఆకాంక్షలను సంతృప్తి పరుస్తూ పాలనను కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.




# మెగాహీరోతో జతకట్టనుందా?

'బలగం'తో అందరి దృష్టినీ ఆకర్షించింది, తెలుగమ్మాయి కావ్య కల్యాణ్‌రామ్. బొద్దుగా ముద్దుగా కనిపించే ఈ అందాలభామ ఓ మెగా ప్రాజెక్ట్‌లో భాగం కానున్నదని ఫిల్మ్ వర్గాల సమాచారం. వివరాల్లోకెళ్తే.. సాయిధరమ్‌తేజ్ హీరోగా రోహిత్ దర్శకత్వంలో 'హనుమాన్'ఫేం నిరంజన్‌రెడ్డి ఓ చిత్రాన్ని నిర్మించనున్న విషయం తెలిసిందే. ఆ సినిమాలో కావ్య ఎంపికైనట్టు తెలుస్తున్నది. అయితే.. అందులో కావ్యను ఎంచుకున్నది కథానాయిక పాత్రకా? లేక ప్రత్యేకపాత్రకా? అనేది తెలియాల్సివుంది. ఈ సినిమాకు 'సంబరాల యేటిగట్టు' అనే టైటిల్ కూడా అనుకుంటున్నారట. యాక్షన్ నేపథ్యంలో సాగే ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ ఈ నెలలోనే మొదలుకానుంది. 'బ్రో' తర్వాత సాయిధరమ్‌తేజ్ నటిస్తున్న సినిమా ఇదే కావడం గమనార్హం.




# అతనే పర్‌ఫెక్ట్‌మ్యాన్ !

ఈ ఏడాది మార్చిలో చిరకాల స్నేహితుడు మాథిస్‌బోను పెళ్లాడింది పంజాబీ భామ తాప్సీ. కొద్దిమంది కుటుంబ సన్నిహితుల సమక్షంలో రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లో వారి వివాహం జరిగింది. తన పెళ్లి గురించి ఇప్పటివరకు ఎలాంటి విశేషాలను పంచుకోలేదు తాప్సీ. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో వివాహంతో పాటు తన భర్త మాథిస్‌బో గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. కాలేజీ రోజుల నుంచి తాను కొంతమంది అబ్బాయిలతో డేటింగ్ చేశానని, అయితే మాథిస్‌బోలో తాను పర్‌ఫెక్ట్‌మ్యాన్‌ను చూశానని తాప్సీ పేర్కొంది. 'మాది ఒక్కరోజులో చిగురించిన ప్రేమకాదు. ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి చాలా సమయం పట్టింది. మాథిస్‌తో చేసిన ప్రయాణంలో నేను చాలా సెక్యూర్డ్‌గా ఫీలయ్యాను. అతను బ్యాడ్మింటన్ ప్లేయర్ కాబట్టి ఎప్పుడూ పాజిటివ్ ధృక్పథంతో కనిపించేవాడు. సవాళ్లను స్వీకరించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే మనస్తత్వం అతనిది. ఈ లక్షణాలు నచ్చే అతన్ని పెళ్లాడాను' అని తాప్సీ చెప్పుకొచ్చింది. భిన్న దేశాలకు చెందిన ఇద్దరి మధ్య సాంస్కృతికంగా భేదాలు ఉన్నప్పటికీ.. మాథిస్‌కు భారతీయ సంప్రదాయాలపై మంచి అవగాహన ఉందని తాప్సీ పేర్కొంది.



# బరువు పెరిగే పనిలో బిజీబిజీ

వయసు 50కి చేరువ అవుతున్నా యంగ్‌స్టర్‌లాగే అనిపిస్తుంటారు మహేశ్‌బాబు. పాత్రకు తగ్గట్టుగా మేకోవర్ అవ్వడంలో మహేశ్ సిద్ధహస్తుడు. సినిమా సినిమాకూ ఆయనలో కచ్చితమైన డిఫరెన్స్ కనిపిస్తుంటుంది. తాజాగా ఆయన ఎస్.ఎస్.రాజమౌళి సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో మహేశ్ పాత్ర ఆంజనేయుడ్ని స్ఫూర్తిగా తీసుకొని డిజైన్ చేశారట. అందుకే దృఢకాయుడిగా మారే పనిలో బిజీగా ఉన్నారట మహేశ్‌బాబు. ఎప్పుడూ తన బరువును అస్సలు పెరగనివ్వని మహేశ్.. ఈ సినిమాకోసం తొలిసారి బరువు పెరిగే పనిలో పడ్డారట. పాత్రకోసం బరువు పెరగాలి. ముఖ్యంగా దృఢంగా మారాలి అని రాజమౌళి సూచించడంతో దానికోసం శ్రమిస్తున్నారట మహేశ్. బరువు పెంచే ఆహారాన్ని తీసుకుంటూ, ఊబకాయం రాకుండా, బలిష్టమైన కండరాలతో, కట్స్‌తో.. ఎయిట్‌ప్యాక్ వచ్చేలా శ్రమిస్తున్నారట మహేశ్. ఇందుకోసం హాలీవుడ్‌కి చెందిన ఓ ప్రత్యేక ట్రైనర్‌ని కూడా ఏర్పాటు చేసుకున్నారట. రెండు భాగాలుగా అత్యంతభారీ వ్యయంతో రూపొందుతోన్న ఈ సినిమాకు నిర్మాత కె.ఎల్.నారాయణ కాగా, ఆయనతోపాటు ఓ హాలీవుడ్ సంస్థ కూడా నిర్మాణంలో భాగం కానున్నదని సమాచారం. ఇప్పటికే కథ ఓ కొలిక్కి వచ్చిందట. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ సినిమా షూటింగ్ సెప్టెంబర్ నుంచి మొదలుకానుందని తెలుస్తున్నది.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com